భారీగా ఉల్లి దిగుమతి


మార్కెట్‌లో ఉల్లి నిల్వలు

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ఉల్లి దిగుమతితో మార్కెట్ ప్రాంగణమంతా కళకళలాడింది. ఇటు రైతులు, వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లతో బుధవారం మార్కెట్ సందడిగా మారింది. ఇతర రాష్ట్రాల నుంచి 47 లారీలు రాగా తెలంగాణ రాష్ట్రం నుంచి 32 లారీల ఉల్లి దిగుమతి అయింది. దాదాపు 25,250 బస్తాలు కాంటా చేసినట్లు వ్యాపారులు వెల్లడించారు.పెద్దరకం ఉల్లి క్వింటాల్‌కు రూ.2300 కాగా రెండో రకం రూ. 1800 ధర పలికినట్లు కమీషన్ ఏజెంట్లు తెలిపారు. గతేడాదితో పోల్చితే రూ. 200 ఎక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ బైరామల్‌గూడలోని పల్లవి అవేర్ ఇంటర్నేషన్ పాఠశాలలో బుధవారం గ్రాడ్యుయేషన్ డేను ఉత్సాహంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మధురిమ రెడ్డి, మోనిక చావ్లా కొత్వాల్ సర్టిఫికెట్లు అందజేశారు.

పరామర్శ


రవికుమార్‌గౌడ్‌ను పరామర్శిస్తున్న కవిత, సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: బీఆర్‌ఎస్ భవన్ వద్ద జరిగిన ప్రమాదంలో కాలు విరిగి ఎల్‌బీనగర్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న తెలంగాణ కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్ గౌడ్‌ను బుధవారం ఎమ్మెల్సీ కవిత, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కుసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. నాయకులు సత్యనారాయణ, విఠల్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కొండల్ రెడ్డి, జహీర్ పరామర్శించారు.

పండ్లు, పుస్తకాల పంపిణీ

దిల్‌సుఖ్‌నగర్: శ్రీ రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ పున్న నిర్మలా గణేష్ నేత పుట్టిన రోజును పురస్కరించుకుని సిరి ఓల్డేజ్ హోమ్‌లో చీరలు, దోతులు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం అనాథ విద్యార్థి గృహంలో నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పున్న గణేష్‌నేత, సభ్యులు బండి మధుసూదన్ రావు, శివ, గట్ల రవీంద్ర, సురేంద్ర కుమార్, తలాటి రమేష్ నేత,జెల్లా జగన్నాథం పాల్గొన్నారు.

విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలి


మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

చైతన్యపురి: వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశ పెట్టబోయే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్ అక్కారి మహేష్ డిమాండ్ చేశారు. బుధవారం దిల్ సుఖ్‌నగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొస్తామని, అధిక నిధులు కేటాయించి విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీలు ఇచ్చారని అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని విమర్శించారు. గతేడాది కేవలం 7 శాతం నిధులు కేటాయించినప్పటికి వాటిని పూర్తిగా విడుదల చేయలేదన్నారు. రాష్ట్రంలో 90 శాతం మంది విద్యార్థులు బీసీ, ఎస్సీ, ఎస్టీ బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులే అని వారంతా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధార పడతారన్నారు. సుమారు రూ.8 వేల కోట్లు పెండింగ్‌లో పెట్టి పేద వర్గాల విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో గంగాధర్, విశ్వతేజ్, విచంటి, మున్న, శివప్రసాద్, నరేష్, అర్జున్, అనిల్ పాల్గొన్నారు.

పర్యవేక్షణ లోపం..
వసూళ్ల పర్వం



- గందరగోళంగా పన్ను వసూలు
- కిందిస్థాయి సిబ్బంది తీరుతో ప్రభుత్వ ఆదాయానికి గండి

దిల్‌సుఖ్‌నగర్: ఆదాయాన్ని సమకూర్చే రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. ఉన్నతాధికారులు పర్యవేక్షణ లోపం కిందిస్థాయి సిబ్బంది లాలూచీతనం జీహెచ్‌ఎంసీ ఆదాయ వనరులనే దెబ్బతీసే స్థాయికి చేరుకున్నాయి. మలక్‌పేట్, సంతోష్‌నగర్, సరూర్‌నగర్ సర్కిళ్ల పరిధిలోని రెవెన్యూ శాఖ అంతా గందరగోళంగా తయారవుతోందని విమర్శలు గుప్పుమంటున్నాయి. గ్రేటర్ రెవెన్యూ వ్యవస్థ ప్రకారం సర్కిల్ పరిధిలోని వాణిజ్య, వ్యాపార సముదాయాలకు ఒక పన్ను విధానం, ఖాళీ స్థలాలకు మరోలా, నివాస గృహాలకు ఇంకోరకం అపార్టుమెంట్, సముదాయాలకు ఇలా వివిధ రకాల పన్ను విధానాలు అమలవుతున్నాయి. ప్రభుత్వం విధి, విధానాలను అనుసరించి మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది ఆస్తిపన్ను వసూళ్లు చేపట్టాల్సి ఉంటుంది. పన్ను విధానంలో నిర్ణయాధికారం కొన్ని నిబంధనలను అనుసరిస్తూ అధికారుల


సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం

విచక్షణపై ఆధారపడి ఉంటుంది. చట్టంలోని ఈ లొసుగును ఆధారంగా చేసుకొని మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది అక్రమాలకు తెర లేపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంటి యజమానులకు విధించే పన్ను చదరపు గజానికి అతి సాధారణంగా ఉంటుంది. ఇంటిని అద్దెకిస్తే ఒక పన్ను, వ్యాపార వ్యవహారాలకు అద్దెకిస్తే మరోపన్ను వసూలు చేస్తారు. అయితే రెవెన్యూ సిబ్బంది ఈ విధానాన్ని ఆసరాగా చేసుకొని ఇంటి యజమానులను బెదిరిస్తూ పన్ను విధింపు ప్రక్రియలో భారీగా జేబులు నింపుకుంటున్నట్లు సమాచారం. ఇంటి యాజమాన్య బదలాయింపు, నూతన రిజిస్ట్రేషన్లు కూడా రెవెన్యూ అధికారుల పరిధిలోకే వస్తాయి. ఈవిధానంలో కూడా అధికారులు భారీగానే వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అధికారుల చుట్టూ ప్రదక్షిణలు..

నూతనంగా ఇంటి నెంబరు కోసం దరఖాస్తు చేసుకున్న వారి వద్ద యాజమాన్యపు హక్కుల బదలాయింపుల కోసం వచ్చిన వారి వద్ద రూ. వేలల్లో వసూలు చేస్తున్నారు. అవకాశం లేని సామాన్య ప్రజలు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయలేక అడిగినంత ముడుపులు చెల్లించక తప్పడంలేదు. జీహెచ్‌ఎంసీలోని విధానాలకు ప్రత్యేక నిబంధనలు ఏర్పడ్డాయి. వాటిని ఆసరా చేసుకున్న అధికారులు తమ ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ తమదైన శైలిలో పన్నులను విధిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రెవెన్యూ సిబ్బంది అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవు

- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: ఇతర పార్టీలకు చెందిన కొంతమంది నాయకులు ఇంటి నిర్మాణదారులను భయభ్రాంతులకు గురిచేసి వసూళ్లకు పాల్పడుతున్నారని, అలాంటి వారిగురించి తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో బుధవారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని అనుమతులు తీసుకుని ఇంటి నిర్మాణం చేపట్టాలని సూచించారు. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కాలనీలోని అనుసంధాన రోడ్ల వద్ద కంకర వేసి వదిలేశారని ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడగా త్వరలోనే రోడ్డు నిర్మాణం చేపడుతామని చెప్పినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. హయత్‌నగర్ పరిధిలో ఏర్పాటు కానున్న ట్రంక్‌లైన్ పనులను కావాలని కొంతమంది రాజకీయ నేతలు అడ్డుకుంటున్నారని, పనులు పూర్తయ్యే వరకు వదిలే ప్రసక్తిలేదని, ఆయా కాలనీలవాసులు ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు. హత్తిగూడ చెరువు ఎఫ్‌టీఎల్‌ను అధికారులు ఫిక్స్ చేశారని, కావాలనే మా సన్నిహితుల ప్లాట్ల నుంచి కందకం తవ్వి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు పోచబోయిన జగదీష్‌యాదవ్, జక్కిడి రఘువీర్ రెడ్డి, రుద్రయాదగిరి, కేకేఎల్‌గౌడ్, ఆనంద్‌యాదవ్, నర్సింగ్‌రావు, కుమార్, భాస్కర్‌యాదవ్, మహేష్, ఆయా కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించినట్లు నిరూపించాలి


మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: కార్పొరేటర్‌గా అధికారులతో అంచనాలు వేయించి, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌పై ఒత్తిడి పెంచి అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేయిస్తే, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శంకుస్థాపనలు చేయటం హాస్యాస్పదంగా ఉందని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మీరు, మేము ఉన్నది ప్రతిపక్షంలోనే మీ ప్రొటోకాల్‌తో మీరు, నా ప్రొటోకాల్‌తో నేను టెంకాయలు కొడతానని స్పష్టం చేశారు. కాలనీవాసులకు ముందుగా సమాచారం ఇచ్చి తర్వాత నాకు సమాచారం ఇచ్చారని, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రొటోకాల్ పాటించకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇంజినీరింగ్ అధికారులతో అంచనాలు రూపొందించి కమిషనర్‌పై ఒత్తిడి పెంచి రూ.1.58 కోట్లతో ప్రత్యేకంగా ఒక ప్యాకేజీ రూపంలో నిధులు మంజూరు చేయించానని, ఈ పనులను ఎమ్మెల్యే శంకుస్థాపన చేయటం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తానే మంజూరు చేయించానని ఎక్కడైన రిప్రజెంటేషన్ ఇచ్చినట్లు ఉంటే చెప్పాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో హరీష్‌రెడ్డి, ఎంజాల జగన్, పాతూరి శ్రీధర్‌గౌడ్, కిరణ్‌రెడ్డి, పారంద సాయి పాల్గొన్నారు.

వైభవంగా మహాసుదర్శన హోమం



హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధి డిఫెన్స్ కాలనీలోని హరిహరక్షేత్ర అయ్యప్ప స్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు రెండవరోజు ఉదయం గణపతిపూజ, మంటపారాధన పూజలు, అయ్యప్పస్వామి మూలమంత్ర హవనములు సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ వంగా మధుసూదన్‌రెడ్డి దంపతులు హోమంలో పాల్గొని పూజాది కార్యక్రమాలు ప్రారంభించారు. పూజల్లో సందీప్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, దశరథగౌడ్, రమేశ్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, అంజయ్యగుప్తా పాల్గొన్నారు.

డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మలక్‌పేట: డబుల్ బెడ్రూమ్ ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శాలివాహననగర్‌కు చెందిన పలువురు బాధితులు డిమాండ్ చేస్తున్నారు. మూసారంబాగ్ మూసీ పరీవాహక ప్రాంతంలో ఉన్న నివాసాలు తొలగించి వారికి ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్‌లు కేటాయించారు. ఇదే అదనుగా భావించిన కొందరు స్థానిక నాయకులు ఇళ్లు ఇప్పిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేశారని తెలిపారు. మూసీ బాధితుల్లో పేర్లు లేనివారు కూడా లబ్ధి పొందారని పేదల డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు రాణి కోరారు.

నేడు 5కే వాకథాన్

లింగోజిగూడ: ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం బైరామల్‌గూడలోని గ్లెనిగల్ అవేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో 5కే వాకథాన్ నిర్వహిస్తున్నట్లు సీఓఓ కరుణాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.కిడ్నీ సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఈ రన్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే వాక్‌లో అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆస్తిపన్ను చెల్లించకపోతే ఆస్తులు జప్తుచేస్తాం

ఎల్‌బీనగర్: హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని మొండి బకాయిదారులపై కొరడా ఝుళిపించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.ఇప్పటికే ఆస్తి పన్ను మొండి బకాయి దారులను గుర్తించిన అధికారులు వారికి రెడ్ నోటీసులను జారీ చేశారు.ఈ నెల 31లోపు చెల్లించకపోతే ఆస్తులను జప్తు చేస్తామని సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్య హెచ్చరించారు.సర్కిల్ పరిధిలోని ముందుగా రూ.లక్ష నుంచి రూ.10 లక్షల మధ్య మొండి బకాయిదారులు మొత్త 1862 మందిని గుర్తించి వారికి రెడ్ నోటీసులు జారీ చేశామన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మలక్‌పేట: మహనీయుల ఆశయాల సాధనకు యువత ఉద్యమించాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల మహేష్ కుమార్ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న మూసారంబాగ్‌లో నిర్వహించనున్న మహనీయుల జయంతి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం మలక్‌పేటలో ఆవిష్కరించి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు తక్షణమే ప్రభుత్వ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మేనార్టీ గురుకులాలకు వెంటనే పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలని కోరారు. భవనాల అద్దెలు వెంటనే చెల్లించాలన్నారు. జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్మల సతీష్ మహాజన్, ఉదయ్‌కుమార్, చంద్రశేఖర్, ఉదయ్, శివ, భాను, కార్తీక్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న దృశ్యం

ఎల్‌బీనగర్: సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్-1 కాలనీ కమ్యూనిటీ హాల్, శ్రీ దేవి పోచమ్మ, అంజనేయ స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం ఆయన వనస్థలిపురం సీఐ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవినాయక్, కాలనీ అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, నాయకులు ప్రదీప్‌రెడ్డి, ధన్‌రాజ్, లక్ష్మారెడ్డి, బిక్షపతి, నవీన్, రాములు, రవి, పెంటారెడ్డి, జలంధర్‌రెడ్డి, కాశీరెడ్డి పాల్గొన్నారు.

నియామకం


సత్యనారాయణ

చైతన్యపురి: ఐజేయూ అనుబంధ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి చెందిన మేకల సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 33 ఏళ్లుగా జర్నలిజం వృత్తిలో ఉంటూ జర్నలిస్టుల సమస్యలపై పోరాటం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.


మధుసూదన్

మన్సూరాబాద్: తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (టీయూడబ్ల్యూజే) ఐజేయూ అనుబంధం రంగారెడ్డి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కోశాధికారిగా మన్సూరాబాద్‌కు చెందిన సూరపల్లి మధుసూదన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 19 ఏళ్లుగా జర్నలిజంలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని జర్నలిస్టుల అభ్యున్నతికి కృషిచేస్తానన్నారు.

డాక్టరేట్ ప్రదానం


డాక్టరేట్ అందుకుంటున్న పరమేశ్వర్

వనస్థలిపురం: వనస్థలిపురంకు చెందిన విశ్వజ్యోతి యోగా గురువు అల్లాడి పరమేశ్వర్ గుప్తాకు డాక్టరేట్ లభించింది. అమెరికన్ సౌత్ వెస్టర్న్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో గోవాలో జరిగిన కార్యక్రమంలో గ్లోబల్ అచీవర్స్ కౌన్సిల్ చైర్మన్ ఆర్.సెల్వం పరమేశ్వర్‌కు డాక్టరేట్ అందజేశారు. పరమేశ్వర్ గత 15 సంవత్సరాలుగా విశ్వజ్యోతి యోగా సెంటర్ ద్వారా ఎందరికో ఉచితంగా యోగా శిక్షణను అందజేస్తున్నారు. పరమేశ్వర్ సేవలను గుర్తించి గ్లోబల్ అచీవర్స్ కౌన్సిల్ సభ్యులు ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

పాయింట్ పవర్ థెరపీపై శిక్షణ

మలక్‌పేట: బ్రహ్మకుమారీస్ మలక్‌పేట బ్రాంచి ఆధ్వర్యంలో ప్రతీ నెల మొదటి, మూడో ఆదివారం పాయింట్ పవర్ థెరపీ నేర్పిస్తారని నిర్వాహకులు తెలిపారు. అక్బర్‌బాగ్ డివిజన్ ఆనంద్‌నగర్ కాలనీలోని బ్రహ్మకుమారీస్ సంస్థలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శిక్షణ ఉంటుందని ఈ నెల 16న శిక్షణ కొనసాగుతుందని మరిన్ని వివరాలకు 93965 23404 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

విద్యార్థినులకు సర్టిఫికెట్ల అందజేత

అబిడ్స్: రిలయన్స్ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో వారం రోజులుగా వివిధ కోర్సుల్లో ఇస్తున్న శిక్షణ కార్యక్రమం ముగిసింది. నాంపల్లి ఇందిరా ప్రియదర్శిని కళాశాలలో ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ చంద్రముఖర్జీ బుధవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థి నులకు సర్టిఫికెట్లు అందజేశారు. కమ్యూనికేషన్, అడాప్టబులిటి, క్రియేటివిటీ, వర్క్‌ప్లాన్, బిహేవియర్‌తో పాటు ఇతర రంగాల్లో దాదాపు 50 మంది విద్యార్థినులకు శిక్షణ ఇప్పించామని ప్రిన్సిపాల్ తెలిపారు. లైవ్లీ ఉడ్ రీజనల్ డైరెక్టర్ ఆరతి సింగ్, గ్లోబల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి జయంత్ రస్తోజి ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, అయోధ్య రాములు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు

నాంపల్లి: హైమాస్ట్ లైట్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను బుధవారం జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగించారు. కాంగ్రెస్ నేతలు జి.వెంకటేశ్, కె.రవితేజ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నాంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి మహ్మద్ ఫిరోజ్‌ఖాన్ ఫిర్యాదు మేరకు మల్లెపల్లి, ఆసిఫ్‌నగర్ ప్రాంతాల్లో హైమాస్ట్ లైట్లకు అడ్డంగా ఉన్న చెట్లు, వాటి కొమ్మలను తొలగించారు.



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే

అక్బర్‌బాగ్ డివిజన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్ హాజరయ్యారు. అఫ్రోజ్‌ఖాన్, మహ్మద్ అక్రమ్ బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు.

–మలక్‌పేట

గ్రౌండ్ లెవెల్‌లో రాజకీయాలు

- మైదానం కావాలని యువకులు, పార్కు కావాలని మహిళలు
- నిలిచిపోయిన అభివృద్ధి పనులు

వనస్థలిపురం: వనస్థలిపురం ఫేస్-2లోని బజరంగ్ క్రాంతి సంఘ్ (బీకేఎస్) మైదానం అధికార, ప్రతిపక్ష నాయకుల 'గ్రౌండ్' లెవెల్ రాజకీయాలకు వేదికగా మారింది. కాలనీలో యువకుల కోరిక మేరకు ఆ స్థలంలో ప్లేగౌండ్ నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నిర్ణయం తీసుకోగా, లేదు ఆ స్థలంలో కాలనీ మహిళలు, సీనియర్ సిటిజన్ల కోరిక మేరకు పార్కుగా అభివృద్ధి చేస్తామని స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ ఆ దిశగా చర్యలు చేపట్టారు. దీంతో బీకేఎస్ గ్రౌండ్ స్థానిక రాజకీయాలకు నెలవైంది.

ఒకటిన్నర ఎకరం స్థలంలో..

ఫేస్-2లో ఒకటిన్నర ఎకరం స్థలంలో బీకేఎస్ గ్రౌండ్ ఉంది. ఇక్కడ నిత్యం యువకులు వివిధ క్రీడలు ఆడుతుంటారు. అయితే.. రాత్రివేళల్లో యువకులు గుంపులుగా చేరి మద్యం తాగుతూ అల్లరి చేస్తున్నారని, ఆ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేయాలని స్థానిక మహిళలు, సీనియర్ సిటిజన్స్ స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో ఆయన మధుయాష్కీగౌడ్ సహకారంతో పార్కు అభివృద్ధికి నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టారు. అయితే ఈ స్థలంలో ప్లే గ్రౌండ్‌ను మాత్రమే నిర్మించాలని యువకులు ఎమ్మెల్యేను కోరగా ఆయన కాలనీ వాసులతో సమావేశం నిర్వహించి వనస్థలిపురంలో ఇప్పటికే పలు పార్కులు ఉన్నాయని, యువత ఆడుకోవడానికి ప్లే గ్రౌండ్ అవసరమని, ఈ స్థలంలో ప్లే గ్రౌండ్‌ను మాత్రమే నిర్వహిస్తామని ప్రకటించారు. స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా గ్రౌండ్ చుట్టూ గ్రిల్స్ ఎత్తు పెంచి, అసాంఘిక కార్యక్రమాలకు చోటు లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు, వాకింగ్ ట్రాక్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ గందరగోళ పరిస్థితిలో గ్రౌండ్‌లో జరుగుతున్న పార్కు అభివృద్ధి పనులు నిలచిపోయాయి.


ఇటీవల వనస్థలిపురం నివాసులతో సమావేశమైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


కాలనీ మహిళలతో మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి (ఫైల్)

స్థానికుల కోరిక మేరకే పార్కుగా అభివృద్ధి

స్థానిక మహిళలు, సీనియర్ సిటిజన్స్ కోరిక మేరకు బీకేఎస్ గ్రౌండ్‌లో వాకింగ్ ట్రాక్, పార్కును అభివృద్ధి చేస్తాం. ఇందులో భాగంగా ఇప్పటికే గ్రౌండ్‌లో బోరు వేయించాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. వాకింగ్ ట్రాక్ నిర్మాణం జరుగుతోంది. దీనిలో రాజకీయాలు తగవు. స్థానికుల అభిప్రాయం మేరకే పార్కు అభివృద్ధి జరుగుతోంది.

వెంకటేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్

అందరికీ సౌకర్యార్థంగా ఉండాలి

పార్కుగా అభివృద్ధి చేయాలని కొందరు, లేదు ప్లేగ్రౌండ్‌గా అభివృద్ధి చేయాలని మరికొందరు డిమాండ్ చేస్తుండడంతో పార్కు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. వనస్థలిపురం నివాసుల సంక్షేమ సంఘం తరపున విజ్ఞప్తి చేస్తున్నాం. అందరి సౌకర్యార్థం గ్రౌండ్‌లో షటిల్, వాలీబాల్ కోర్టులు, వాకింగ్ ట్రాక్, మిగిలిన స్థలంలో పార్కును అభివృద్ధి చేయాలి.

– కొలిశెట్టి సంజయ్‌కుమార్, సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి